సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



పశు బీమాకు ఆదరణ కరువు

పాడి రైతును ఆదుకునేందుకు పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చారు. అయితే బీమా చేయించడానికి రైతులు ముందుకు రావడం లేదు. 8లో ▸



రఘురామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలి


అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో నిరసనలు కొనసాగాయి. 8లో ▸



రూ.9 లక్షలకు టోకరా

ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్ళు సీబీఐ అధికారులమంటూ బెదిరించి రూ. 9 లక్షల సొమ్ములు కాజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 8లో ▸

లిక్కర్ దందాతో కూటమిలో కిక్కు



- నియోజకవర్గాలవారీగా సిండికేట్లతో ప్రజాప్రతినిధుల డీల్
- లాభాల్లో సగటున 40 నుంచి 70 శాతం ముడుపులివ్వాల్సిందేనని డిమాండ్
- ఎమ్మెల్యేల డిమాండ్లతో అవాక్కవుతున్న లిక్కర్ వ్యాపారులు
- తనకు తెలియకుండా దరఖాస్తు చేయడానికి వీల్లేదని ఓ ఎమ్మెల్యే హుకుం
- మరో నియోజకవర్గంలో షాపులు మొత్తం ఎమ్మెల్యేవే



సాక్షి ప్రతినిధి, ఏలూరు: జిల్లాలో లిక్కర్ దందాకు తెరలేచింది. వైన్ షాపులన్నీ ప్రైవేటు పరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన క్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు భారీ ఆదాయ వనరుగా మార్చుకునే ప్రయత్నాలకు తెరదీశారు. దీనిలో భాగంగా రహస్య భేటీలు, నిరంతర పంచాయతీలు, పాత సిండికేట్లకు పరోక్ష హెచ్చరికలు జారీ చేస్తూ కూటమి ప్రజా ప్రతినిధులందరూ లిక్కర్ దందాలో బిజీగా ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా లాభాల్లో 40 నుంచి 70 శాతం వరకు నెలవారీ ముడుపులుగా చెల్లించాలనే కొత్త డిమాండ్‌కు ప్రజా ప్రతినిధులు శ్రీకారం చుట్టడంతో వ్యాపారులు అవాక్కవ్వడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ఆమోదించింది. ఈ క్రమంలో వచ్చే నెల నుంచి ప్రైవేటు వైన్ షాపులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఎక్సైజ్ అధికారులు నియోజకవర్గాల వారీగా జనాభా ప్రాతిపదికన షాపుల సంఖ్యను సిద్ధం చేసి గెజిట్ విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఒకటి, రెండు నియోజకవర్గాలు మినహా అన్ని నియోజకవర్గాల్లో సగటున 25 నుంచి 40 షాపులు ఏర్పాటు కానున్నాయి. ఏలూరు జిల్లాలో 168, పశ్చిమగోదావరి జిల్లాలో 225 షాపులు ఏర్పాటు కానున్నాయి. వీటిలో ఏలూరు జిల్లాలో 16, పశ్చిమగోదావరి జిల్లాలో 27 గౌడ కులస్తులకు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ ప్రజాప్రతినిధులు లిక్కర్ వ్యాపారులతో బేరసారాలకు తెరదీశారు. అది కూడా భారీ స్థాయిలో జరుగుతుంది. ప్రతి నియోజకవర్గంలో వైన్‌షాపులు స్థానిక ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే నడవాలి. జనసేన, బీజేపీ ఉన్నచోట టీడీపీ నేతలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలంటూ ఇప్పటికే ప్రజాప్రతినిధులు బహిరంగంగా మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గాలవారీగా ప్రజాప్రతినిధులు బేరాలు ఖరారు చేసుకోవడానికి వీలుగా భారీ పర్సంటేజీలు డిమాండ్ చేస్తున్నారు.

పశ్చిమలో పర్సంటేజీలు ఇలా

పశ్చిమగోదావరి జిల్లాలో కేవలం రెండు నియోజకవర్గాల్లో మాత్రమే పర్సంటేజీలు ఖరారు చేయలేదు. మిగిలిన అన్ని చోట్ల ప్రజాప్రతినిధుల అనుచరులు, కొత్తగా సిండికేట్‌పై ఆశలు పెట్టుకున్న నేతలు రేట్లు ఖరారు చేశారు. ఓ నియోజకవర్గంలో 42 వైన్‌షాపులు వచ్చే అవకాశం ఉంది. ఎవరైనా వైన్‌షాపుకు దరఖాస్తు చేసుకుని షాపు దక్కించుకోవచ్చు. టర్నోవర్‌పై వచ్చే లాభంలో 75 శాతం ప్రతి ఆరు నెలలకొకసారి చెల్లించాలని డిమాండ్ పెట్టారు. దీంతో సిండికేట్లు పరిస్థితి అర్థం కాక తలలు పట్టుకునే పరిస్థితి. మరో రెండు నియోజకవర్గాల్లో 50 శాతం లాభాల వాటా డిమాండ్ చేశారు. ప్రధాన రహదారుల వెంట ఉంటే మరో నియోజకవర్గంలో సగం షాపులు సొంతమనిషికి, మిగిలిన షాపుల్లో లాభాల్లో వాటాలు ఇవ్వాలని డిమాండ్ కొనసాగుతుంది.

ఏలూరు జిల్లాలో..

జిల్లాలో ఓ ఎమ్మెల్యే అన్ని షాపులు తన టీంకే ఇవ్వాలని.. వేరే ఎవరూ దరఖాస్తులు వేయడానికి వీల్లేదంటూ మద్యం వ్యాపారులందరికీ కబురు పంపారు. మరో నియోజకవర్గంలో 30 నుంచి 40 శాతం కప్పం కట్టాల్సిందేనని తేల్చిచెప్పారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాకపోవడం, పూర్తి స్థాయిలో ఖరారు కాకముందే పర్సంటేజీల బేరాలు తీవ్రస్థాయిలో సాగుతుండటం గమనార్హం. ఈ పరిణామాల క్రమంలో బుధవారం బీసీ సంఘ నేతలు కొందరు లిక్కర్ సిండికేట్ల సమావేశం నిర్వహించి అధికారికంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపి అనంతరం ప్రజాప్రతినిధుల డిమాండ్లపై చర్చించి పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. గౌడ కులస్తులకు కేటాయించిన షాపుల్లోనూ పర్సంటేజీలు డిమాండ్ చేస్తున్నారని కొందరు ప్రస్తావించగా సమావేశానికి హాజరైన ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అందరూ అప్లికేషన్లు దాఖలు చేయండని.. ఎవరికి రూపాయి కట్టకుండా వ్యాపారం చేసుకుందామని చెప్పినట్లు తెలుస్తుంది.

న్యూస్‌రీల్

లడ్డూ కల్తీపై విచారణ చేయాలి

వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ



తణుకు: సున్నితమైన విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం రచ్చ చేస్తోందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లడ్డూలో నెయ్యి కల్తీ జరిగిందని ఆరోపణ రాగానే, ప్రస్తుత ప్రభుత్వం పూర్తి విచారణ చేసి బాధ్యులైన వారికి శిక్ష పడేలా చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారంలో ఉన్న వారు ఆరోపణలు చేయకూడదని, తగిన ఆధారాలతో కారకులను బయట పెట్టాలన్నారు. గత ప్రభుత్వం తిరుమల ఆలయ నిర్వహణలో ఏదైనా తప్పులు చేసిందని భావిస్తే, వాటి కోసం ప్రత్యేక విచారణ కమిటీ వేసి నిజ నిర్ధారణ తేల్చి వాస్తవాలను బహిర్గతం చేయాలన్నారు. లడ్డూలోని నెయ్యి ఏ బ్యాచ్ శాంపిళ్లు అహ్మదాబాద్ పంపించారు? రిజెక్ట్ చేసిన నెయ్యిలోని శాంపిల్స్, తదుపరి పరీక్ష కోసం పంపించారా? శాంపిల్స్ తీస్తున్నప్పుడు ఏయే అధికారులు దగ్గరున్నారు? అహ్మదాబాద్‌కు ఎన్ని శాంపిల్స్ పంపించారు? పదేళ్ల కాలంలో ఎప్పుడైనా ఈ అహ్మదాబాద్ ల్యాబ్‌కు శాంపిల్స్ పంపించారా? ఇలాంటి లాబ్స్ మన రాష్ట్రంలో లేదా దక్షిణ రాష్ట్రాలలో లేవా? ఈ వివరాలతో ప్రభుత్వం లడ్డూ ప్రసాద విషయాన్ని బహిర్గత పరిస్తే కోట్లాది భక్తులు మానసిక వ్యథకు గురికారని ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ పేర్కొన్నారు.

రథాలు పరిశీలించిన పోలీసులు



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో రథం పరిశీలిస్తున్న సీఐ, ఈవోలు

పాలకొల్లు సెంట్రల్: అనంతపురం జిల్లాలో రాములవారి రథానికి దుండగులు నిప్పు పెట్టడంతో పట్టణ పోలీసులు, క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. పట్టణంలో క్షీరారామలింగేశ్వర స్వామి, యడ్లబజారు శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల ఆలయాల్లో రథాలు ఉన్నాయి. బుధవారం పట్టణ సీఐ కె.రజనీకుమార్ రెండు ఆలయాల రథాలను పరిశీలించారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో రథం భద్రంగానే ఉందని కనకదుర్గమ్మ ఆలయం రథం మాత్రం పెనుమదం రోడ్డులో రైస్‌మిల్లులో ఉందని తెలిపారు. కనకదుర్గమ్మవారి రథం కూడా సెక్యూరిటీగా ఉన్న ప్రదేశంలో ఏర్పాటుచేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారికి సూచించారు.

వేతన బకాయిల చెల్లింపులపై విచారణ



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కార్మిక శాఖ సహాయ కమిషనర్ నాగలక్ష్మి

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు పీఎఫ్, ఈఎస్ఐ, వేతన బకాయిలకు సంబంధించి కాంట్రాక్టర్లకు నోటీసులు జారీచేయనున్నట్లు నరసాపురం సహాయ కార్మిక శాఖ కమిషనర్ ఎ.నాగలక్ష్మి అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని కార్మికుల సమస్యలపై బుధవారం ఆమె విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ చదలవాడ నాగరాణికి చేసిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో విచారణకు వచ్చినట్లు చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులకు 3 నెలలు, సెక్యూరిటీ గార్డ్స్‌కు 2 నెలలు వేతన బకాయిలు ఉన్నాయని, ఇక పీఎఫ్, ఈఎస్ఐ గత కొంతకాలంగా పెండింగ్‌లో పెట్టారని తేలిందన్నారు. కార్మికుల నుంచి అన్ని సమస్యలు తెలుసుకున్నానని జాయింట్ కమిషనర్ దృష్టిలో పెట్టి కాంట్రాక్టర్‌కి నోటీసులు జారీ చేసి కార్మికుల ఖాతాలో వేతన బకాయిలు జమయ్యేలా చూస్తామని స్పష్టం చేశారు.

నవోదయ దరఖాస్తుల గడువు పొడిగింపు

దెందులూరు: జవహర్ నవోదయ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు దెందులూరు ఎంఈఓ ఏవీఎస్వీ ప్రసాద్ అన్నారు. షెడ్యూల్ ప్రకారం గతంలో ప్రకటించిన గడువు సెప్టెంబర్ 23తో ముగిసిందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తితో ప్రభుత్వం పొడిగించిందన్నారు. మరిన్ని వివరాలకు జవహర్ నవోదయ పాఠశాల, ఎంఈఓ కార్యాలయం వెబ్‌సైట్లలో చూసుకోవచ్చని సూచించారు.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పాలకోడేరు: గొరగనమూడి స్వామి జ్ఞానానంద హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉభయగోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్ 14, అండర్ 17 బాలబాలికల నెట్‌బాల్ జట్ల ఎంపికలు జరిగాయని హెచ్‌ఎం బి.శ్రీదేవి తెలిపారు. 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జట్లకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

అండర్ 14 బాలుర జట్టు: కె.ఆంటోనీ, జి.నాగేంద్ర, జి.సురేష్‌బాబు, బి.లోకేష్, కె.గగన్ గౌతమ్, జె.దినేష్‌కుమార్, కె.నరేంద్ర, ఎం.లోకేష్‌కుమార్, పి.సునీల్, పి.విజయకుమార్, సీహెచ్ దినేష్, టి.వరుణ్‌తేజ్, స్టాండ్ బైలుగా జి.మోహన్ సాయి, పి.చరిత్, కె.తేజ భద్రపవన్, పి.నగేష్, ఎ.రాజేష్.

అండర్ 14 బాలికల జట్టు: డి.జోత్స్నా నాగసాయి, డి.గీతిక, పి.వసుంధర, టి.మహాలక్ష్మి, కె.గుణవర్షిత, పి.శృతి, వి.రమ్యశ్రీ, వి.లావణ్య, పి.బిందు శ్రీ మంజు, జి.అనుస్య, ఎస్.పరిమళ, టి.నేత్ర. స్టాండ్ బైలుగా కె.సుమశ్రీ, పి.వర్షికా సాయి, జె.భవ్యశ్రీ, ఎస్.వనిత, ఎ.భార్గవి సౌజన్య.

అండర్ 17 బాలుర జట్టు: ఎస్.విలియం, కె.హర్షవర్ధన్, బి.రాజేష్, ఎ.నిఖిల్ వినయ్, కె.లోకేష్, కె.దుర్గాగణేష్ పవన్, వి.మనోజ్, జి.త్రినాథ్, బి.హరీష్, ఎస్.మహేష్‌బాబు, ఎం.సంతోష్, బి.విజయబాబు. స్టాండ్ బైలుగా డి.రాజేష్, కేఎంవీఎం.కృష్ణ, బి.రమేష్, జె.ఆకాష్‌సత్య, ఆర్.అవినాష్.

అండర్ 17 బాలికల జట్టు: ఎం.ఎస్తేరు, ఎస్.వెంకట రేష్మ, ఎస్.గంగాభవాని, ఎ.పోషిత, డి.రేష్మ, కె.అక్షయ, కె.మానస, టి.ఉమాభవాని, వి. ఇందుజ, వి.తేజస్విని, వై.వినీల వర్షిణి, కె.నందిని. స్టాండ్ బైలుగా.. వి.దీప్తిష, కె.శ్రీలక్ష్మీదుర్గ, సీహెచ్ కాంచన, డి.సాక్షి, వి.నవ్యశ్రీ వెంకట దుర్గ.

మెడికల్ కాలేజీ పనులు కొనసాగించాలి

వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి తదితరులు

పాలకొల్లు అర్బన్: మెడికల్ కళాశాల పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేయడం పట్ల వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి తీవ్రస్థాయిలో మండి పడ్డారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో నిలిపివేసిన మెడికల్ కళాశాల పనులను ఆయన పరిశీలించారు. కళాశాలకు సంబంధించి ఐరన్, సిమెంట్, ఇసుక, ఇతర మెటీరియల్ వేరే ప్రాంతానికి తరలిస్తున్నట్లు స్థానికంగా ఉన్న మెగా ఇంజనీరింగ్ సంస్థ ఉద్యోగులు గుడాల గోపికి వివరించారు. ఈ సందర్భంగా గోపి విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూ.475 కోట్లు మంజూరు చేశారన్నారు. కళాశాల నిర్మాణానికి అవసరమైన భూములను రైతుల నుంచి సేకరించి సొమ్ములు కూడా చెల్లించారన్నారు. కళాశాల పనులు గత నెల రోజులుగా నిలిపివేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు కుట్రపూరితంగా రాష్ట్రంలోని 17 కళాశాలల పనులు నిలిపివేశారన్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం, మాజీ సర్పంచ్ సప్పరపు కోటేశ్వరరావు, నాయకులు బొడ్డేటి సూర్యానారాయణ, చల్లా విశ్వనాథం పాల్గొన్నారు.

ఇరగవరంలో భారీ వర్షం

భీమవరం: ఇరగవరంలో 133.4 మిల్లీమీటర్ల వర్షపాతం బుధవారం ఉదయం నమోదు కాగా తాడేపల్లిగూడెంలో 70.2, పెంటపాడులో 5, తణుకులో 56.2, అత్తిలిలో 45.4, ఉండిలో 16.4 పాలకోడేరులో 30.2 పెనుమంట్రలో 63.4 మిల్లీ మీటర్ల వర్షం పడింది. పెనుగొండలో 75.4, ఆచంటలో 44.2, పోడూరులో 42.2, వీరవాసరంలో 20.4, భీమవరంలో 20.8, మొగల్తూరులో 22.4, నరసాపురంలో 57.4, పాలకొల్లులో 75.2, యలమంచిలిలో 22.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ

జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి



భీమవరం: ధాన్యం కొను గోలుకు రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల సన్నద్ధతపై నిర్వహించిన జిల్లా కమిటీ సభ్యుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు వారికి నచ్చిన రైస్ మిల్లును ఎంపిక చేసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. సాధారణ ధాన్యం రకానికి క్వింటాల్‌కు రూ.2,300, గ్రేడ్- ఏ ధాన్యం రకానికి రూ.2,320 కనీస మద్దతు ధరను నిర్ణయించినట్లు చెప్పారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలను సెప్టెంబర్ 26న భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో, సెప్టెంబర్ 27న తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 28న నరసాపురం డివిజన్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు.

స్వచ్ఛ భారత్ దిశగా అడుగులు

నరసాపురానికి చెందిన సత్యనారాయణమ్మకు కేంద్రం ప్రశంసలు



సత్యనారాయణమ్మ

సాక్షి, న్యూఢిల్లీ/నరసాపురం: నరసాపురం పట్టణం పొన్నపల్లి వార్డులోని సత్యనారాయణమ్మ పరిశుభ్రత విషయంలో చేసిన ప్రయత్నాలు స్వచ్ఛ భారత్ దృష్టిని ఆకర్షించాయి. దివ్యాంగురాలైన ఆ మత్స్యకార మహిళ ఇద్దరు పిల్లల తల్లి. స్వచ్ఛభారత్ దిశగా వేసిన అడుగులు పొన్నపల్లి వార్డుకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. ఒకప్పుడు బహిరంగ మలవిసర్జనతో అపరిశుభ్రంగా ఉన్న పొన్నపల్లి వార్డు ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ప్రయత్నాలు విజయం సాధించాయి. దీంతో పొన్నపల్లి వార్డు బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) హోదాను సాధించింది, సత్యనారాయణమ్మ తన కుటుంబానికి మాత్రమే కాకుండా మొత్తం వార్డు పరిశుభ్రతకు నడుం బిగించింది. మహిళల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అవగాహన పెంచడానికి అంకితమైన స్థానిక ఎన్‌జీఓ జెండర్ ఫోరంలో చేరడంతో సత్యనారాయణమ్మ ప్రయాణం ప్రారంభమైంది. ఇతర సభ్యులతో కలిసి, ఆమె రుతుక్రమ పరిశుభ్రత, టాయిలెట్ వాడకం, చేతులు కడుక్కోవడం వంటి కీలక అంశాల ప్రచారం కోసం చేపట్టిన చర్చలకు నాయకత్వం వహించింది. స్వచ్ఛ భారత్ మిషన్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్వభావ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత ప్రచారానికి పొన్నపల్లి సత్యనారాయణమ్మ స్ఫూర్తిగా నిలిచారని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ తెలిపింది.

టీటీసీ పరీక్షలు వాయిదా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు డ్రాయింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్‌లూమ్, వీవింగ్ (లోయర్ గ్రేడ్) పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి జరగాల్సిన థియరీ పరీక్షలను ఏపీ టెట్ జూలై-2024 పరీక్షల కారణంగా వాయిదా వేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు అక్టోబర్ 27 నుంచి జరుగుతాయని తెలిపారు.

ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై నీలినీడలు

- రూ 429.43 కోట్లతో హార్బర్ నిర్మాణానికి జగన్ సర్కార్ శ్రీకారం
- గత 3 నెలల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడని వైనం
- మత్స్యకారుల్లో ఆందోళన



హార్బర్ లేకపోవడంతో వశిష్ట గోదావరి గట్టున నిలిపిన వేట బోట్లు

నరసాపురం: సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న నరసాపురంలో దశాబ్దాల కలగా ఉన్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో జిల్లాకు మంజూరు చేసిన ఈ భారీ ప్రాజెక్ట్ గత మూడు నెలలుగా పడకేసింది. ఎన్నికలకు ముందు పనులు ప్రారంభం కాగా నేడు అసలు హార్బర్ నిర్మాణం జరుగుతుందా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. దీంతో తీరప్రాంత మత్స్యకారులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమ జిల్లా అభివృద్ధిలోనే గేటురాయిగా మొత్తం గోదావరి జిల్లాలకు మణిహారంగా నరసాపురంలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. నరసాపురం మండలం బియ్యపుతిప్పలో మేజర్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి 2022 మే నెలలో ఏపీ మారిటైమ్ బోర్డు టెండర్లు పిలవగా, విశ్వసముద్ర సంస్థ పనులు దక్కించుకుంది. అప్పటి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపించడంతో ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులతో పాటు ఇతర సాంకేతిక అనుమతులు కూడా వెంటనే తెప్పించారు. టెండర్లు పిలవడంతో విశ్వసముద్ర సంస్థ పనులు దక్కించుకుంది. రూ.429.43 కోట్లతో నిర్మించే హార్బర్‌కు సంబంధించిన ప్రాథమిక పనులు ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించారు.

కూటమి సర్కార్ రాకతో పడకేసిన పనులు

కూటమి సర్కార్ వచ్చిన తరువాత ఈ ప్రాజెక్ట్ అంశంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తికావడం, ప్రాథమికంగా పనులు ప్రారంభమయ్యాయి. కూటమి సర్కార్ గద్దెనెక్కిన తరువాత పనులు చేపట్టడంలో విశ్వసముద్ర సంస్థ వెనకడుగు వేసినట్టు సమాచారం. దీంతో అసలు హార్బర్ కల సాకారమవుతుందా? లేదా? అనే సందేహం వ్యక్తయవుతోంది. 19 కిలోమీటర్లు సముద్ర తీరప్రాంతం ఉన్న నరసాపురంలో బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఈ ప్రాంతంలో 5 వేల మత్స్యకార కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి.

తీరంలో అపార మత్స్యసంపద

మత్స్య సంపద, ఆక్వా ఎగుమతుల్లో ఉమ్మడి పశ్చిమ జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. పశ్చిమ నుంచి దేశ, విదేశాలకు భారీగా ఆక్వా ఎగుమతులు జరుగుతుంటాయి. రొయ్యలు, చేపల సాగు పెరగడం ఆక్వా రంగం పుంజుకుంది. ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆక్వా పుణ్యమాని జిల్లాకు వస్తోంది. ఇటు తీరప్రాంతంలో సముద్ర మత్స్యసంపదతో భారీగా ఆదాయం సమకూరుతుంది. ఏటా నరసాపురం తీరంలో రూ.300 కోట్ల విలువచేసే మత్స్య ఎగుమతులు సాగుతాయి. హార్బర్ లాంటి మౌలిక వసతులు ఉంటే మరో 40 శాతం ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. ఈ కారణంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హార్బర్ నిర్మాణానికి పూనుకుంది. బియ్యపుతిప్ప వద్ద ఫిషింగ్ హార్బర్‌ను 600 ఎకరాల విస్తీర్ణంలో రూ.429.43 కోట్లతో నిర్మించ తలపెట్టి పనులు మొదలుపెట్టారు.

హార్బర్ పూర్తి చేయాలి



ఫిషింగ్ హార్బర్‌ను దశాబ్దాలుగా మత్స్యకారులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం ఖర్చు భరించేలా నిర్మాణానికి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం చేశారు. టెండర్లు పిలిచి, పనులు విశ్వసముద్ర సంస్థకు అప్పగించాం. పనులు ప్రాథమికంగా ప్రారంభమయ్యాయి. హార్బర్ నిర్మాణం చేయాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వం మీద ఉంది. కొత్త ప్రభుత్వం హార్బర్ నిర్మాణం పూర్తిచేస్తే మేం ఆనందిస్తాం.

– ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

ఎర్ర కాలువలోకి వరద నీరు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని కొంగువారిగూడెం కెకెఎం ఎర్ర కాలువ జలాశయంలోకి వరద నీరు పోటెత్తుతోంది. కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి గంటకు 3,044 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా డ్యాం గేట్ల ద్వారా గంటకు 1590 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.05 మీటర్లు ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు.

క్లుప్తంగా

బైక్‌ల దొంగ అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ

చాట్రాయి : మోటార్‌సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసినట్లు నూజివీడు సీఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం గ్రామానికి చెందినకోట రవి పగలు పుచ్చకాయల వ్యాపారం చేస్తూ రాత్రిళ్లు దొంగతనాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. మాకు వచ్చిన సమాచారం మేరకు నిందితుడు ఇంటిపై దాడి చేసి 12 ద్విచక్రవాహనాలు, ఒక మేక పోతుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఆయన చెప్పారు. మోటారుసైకిళ్ల రికవరీలో ప్రతిభ చూపిన ఎస్సై రామకృష్ణ, కానిస్టేబుళ్లు ఎం విజయ్ భాస్కర్, విష్ణుకుమార్, కె.గిరిబాబులను అభినందించి నగదు పారితోషికాన్ని అందజేశారు.

సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలి



కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన

భీమవరం(ప్రకాశం చౌక్): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు మాట్లాడుతూ 'థాలీ బజావో' పేరిట ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టమన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన 6 హామీల్లో ఒక్క హామీ కూడా అమలు చేయలేదని పైగా ఇది మంచి ప్రభుత్వమని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ భీమవరం ఇన్‌చార్జి అంకెం సీతారామ్ మాట్లాడారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు మార్నీడి బాబ్జి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సోము నాగ కేశవబాబు, యూత్ కాంగ్రెస్ భీమవరం అధ్యక్షుడు బోణం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఉద్యోగి మృతి

కాళ్ల: లారీ ఢీకొని చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి మృతి చెందాడు. కాళ్ళ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన సాలా వెంకటేశ్వరరావు(48) భీమవరం వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం కాళ్ల మండలం పెదఅమీరం పరిధిలో ఉన్న ఉండి మార్కెటింగ్ యార్డ్ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తుండగా రొయ్యల లారీని ఎరజెండాతో ఆపే ప్రయత్నం చేశారు. సదరు వాహనం అతివేగంతో వెంకటేశ్వరరావుని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని భీమవరం ఆసుపత్రి తీసుకువెళ్లగా మృతి చెందాడు. దీనిపై వెంకటేశ్వరరావు కుమారుడు శ్రవణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పశు బీమాకు ఆదరణ కరువు

యలమంచిలి : పశుపోషణ వ్యవసాయ అనుబంధ రంగం. పల్లెల్లో ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు చాలానే ఉన్నాయి. పాడి పశువులు ప్రమాదవశాత్తు గానీ, జబ్బు చేసి గానీ, వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలోను, విష సర్పాల కాటు వలన, అగ్ని ప్రమాదాల వలన మరణిస్తే ఆ పాడి రైతుకు చాలా నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే పశువులకు బీమా చేయించడానికి రైతులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరడం లేదు.

20 శాతం రైతులు చెల్లించాలి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పశువుల బీమా అందజేస్తున్నాయి. ఈ బీమా ప్రీమియం మూడేళ్లకు రూ.2 వేలు కాగా కేంద్ర ప్రభుత్వం రూ.800 రాష్ట్ర ప్రభుత్వం రూ.800 చెల్లిస్తాయి. మిగిలిన రూ.400 రైతులు చెల్లించాలి. అదే గొర్రెలు లేదా మేకకు అయితే కేవలం రూ.20 కడితే మిగిలిన రూ.80 కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా చెల్లిస్తాయి. ఒకటి లేదా రెండు పశువులు ఉన్న రైతులు బీమా కడుతున్నారు కాని, ఎక్కువ పాడి పశువులు ఉన్న రైతులు ఒక్కసారిగా అంత మొత్తం చెల్లించలేక బీమా కట్టడానికి ముందుకు రావడం లేదు. దీంతో పశువుల బీమాకు ఆదరణ కరువైంది.



యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంలో పశువుల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

	జిల్లాలో ఉన్న పశువులు	బీమా చేసినవి
ఆవులు	45,600	1555
గేదెలు	1,78,000	4513
మేకలు	38,000	420
గొర్రెలు	22,500	318

ఏ జాతికి ఎంత బీమా వస్తుందంటే...

ఏదైన ప్రమాదం వలన జంతువు మరణిస్తే దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.30 వేలు, నాటు జాతికి చెందిన పశువులకు రూ.15 వేలు, గొర్రె, మేకకు రూ.6 వేలు వరకు బీమా వస్తుంది. అయితే చాలా మంది రైతులు బీమా చెల్లించకపోవడంతో ప్రమాదవశాత్తు పశువు మరణించినా ఒక్క రూపాయి కూడా రావడంలేదు. ఆ సమయంలో రైతులు నాయకుల చేత సిఫారసు చేయించినా, అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండదు. కనుక ప్రతి పశువుకు బీమా చేయించవలసి ఉంటుంది. ముఖ్యంగా లంక గ్రామాల రైతులకు బీమా అవసరం ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఏడాది వరదలు వస్తున్న తరుణంలో విష సర్పాల వలన, వరదల వలన పశువులకు ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో లంక గ్రామాల రైతులంతా తప్పనిసరిగా ప్రతి పశువుకు బీమా చేయించడం ఉత్తమం.

మార్గదర్శకాలు..

బీమా చేయించేటప్పుడు రైతు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు అందించాలి. పాడి పశువులకు బీమా చేసే క్రమంలో ట్యాగ్ వేస్తారు. ప్రమాదవశాత్తు పశువు మరణిస్తే వెంటనే సమీపంలోని సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. ఒకవేళ బీమా చేయించిన పశువును అమ్మివేస్తే పశువును కొనుగోలు చేసిన వ్యక్తి ఏడు రోజుల్లో బీమా కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి తన పేరు మీద బీమా మార్చుకోవాలి.

తప్పకుండా బీమా చేయించాలి



రైతులు కేవలం 20 శాతం బీమా కడితే మిగిలిన 80 శాతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీమా చెల్లిస్తాయి. ఈ విధంగా దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.400, నాటు జాతికి చెందిన పశువులకు రూ.200, గొర్రె, మేకకు రూ.20 బీమా చెల్లిస్తే సరిపోతుంది. రైతులంతా తప్పకుండా తమ పశువులకు బీమా చేయించుకోవాలి.

– డాక్టర్ గంజనబోయిన మల్లేశ్వరరావు, పాలకొల్లు ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు

రఘురామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలి



పోడూరు మండలం కవిటంలో మాలసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం



పాలకొల్లు కోర్టు ఆవరణలో న్యాయవాదుల నిరసన

పెనుగొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం పోడూరు మండలం కవిటం సెంటర్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో తీవ్ర నిరసన వ్యక్తం చేసి, దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ ఏ స్థలంలో అంబేద్కర్ ఫ్లెక్సీ పెకిలించి వేశారో, అదే స్థలం వద్ద రఘురామకృష్ణరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం ఆర్‌ఆర్‌ఆర్‌ను టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం క్రింద కేసు నమోదు చేయాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షుడు జీవీ ప్రసాద్ మాట్లాడుతూ సీఎం, స్పీకర్ కలగచేసుకోకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం పోడూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చోడదాసి జైపాల్, మండల గౌరవ అధ్యక్షుడు బుడితి భీమారావు, మండల అధ్యక్షుడు త్రిమూర్తులు, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

పాలకొల్లు అర్బన్ : ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపివేయడం దారుణమని ఎస్సీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బండి సుందరరామమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పాలకొల్లు కోర్టు ఆవరణ ముందు న్యాయవాదులు నిరసన తెలిపారు. ఉండి ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు వడ్లపాటి ఆనందరాజు, సరెళ్ల బాలకృష్ణ, వేదాల నాగరాజు, రావి దేవరాజు, జీపీ సుదర్శనరావు తదితరులు నిరసన తెలిపిన వారిలో ఉన్నారు. వీరికి పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, సంఘీభావం తెలిపారు.

బీసీ ఎంపీల రాజీనామా విచారకరం



మాట్లాడుతున్న జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పేరుతో బీసీలకు రాజ్యసభలో మాట్లాడే అవకాశం కల్పిస్తే ఆ పదవులకు న్యాయం చేయకుండా రాజీనామాలు చేయడం పట్ల జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య రాజ్యసభకు రాజీనామాలు చేయడం యావత్ బీసీలకు నష్టమన్నారు. బీసీ సంఘాలు అనేక సంవత్సరాలుగా చట్టసభల్లో సంఖ్యాపరంగా బీసీలకు అవకాశం కల్పించాలని ఉద్యమాలు చేపడుతుంటే వచ్చిన అవకాశాన్ని వదులుకోవడం ఆ నాయకుల స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. దీని వలన రాష్ట్రంలోని 3 కోట్ల మంది బీసీలకు తీరని నష్టం కలుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభలో ఖాళీ అయిన సీట్లను ఆయా రాజకీయ పార్టీలు బీసీ సామాజిక వర్గాలతో భర్తీ చేయాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సత్యనారాయణ, కండిబోయిన సుబ్రహ్మణ్యం, మల్లాడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

నూజివీడు: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ఎంపవర్ స్కిల్స్ అకాడమీ ప్రతినిధి కొడాలి ప్రదీప్ పేర్కొన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలోని పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు బుధవారం ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా సమయపాలన అలవర్చుకోవాలన్నారు. ప్రతి విషయాన్ని ప్రణాళికాబద్ధంగా ఆలోచించి ఆచరించాలన్నారు. ఏకాగ్రతతో చదివితే మరింత ముందుకు వెళ్లగలరని విద్యార్థులకు సూచించారు. సంస్థకు చెందిన మరో ఇరువురు ప్రతినిధులు కొల్లూరు వెంకట్, నందకిషోర్ మాట్లాడుతూ జీవితంలో కష్టపడి ఉన్నత స్థానాలకు ఎదిగిన గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను తరచూ చదువుతూ స్ఫూర్తి పొందాలన్నారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, స్టడీ స్కిల్స్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కన్వీనర్ నాగార్జునదేవి, స్టూడెంట్ డీన్ వెల్ఫేర్ అధికారులు ఏ బ్రహ్మాస్వాములు, టీ దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు

నూజివీడు: స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న పలు క్రిమినల్ కేసులలో సాక్ష్యం ఇవ్వకుండా కోర్టుకు గైర్హాజరవుతున్న ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం ఏలూరు రేంజ్ డీఐజీకి, ఎస్పీలకు సిఫార్సు చేశారు. గతంలో ముసునూరు ఎస్సైగా పనిచేసిన రాజారెడ్డి పలు కేసులకు సంబంధించిన చార్జిషీట్లు దాఖలు చేయగా, ప్రస్తుతం అవి విచారణ దశలో ఉన్నాయి. ఈ దశలో ఎస్సై కోర్టుకు రాకుండా ఏదో ఒక కారణాన్ని చూపుతూ గైర్హాజరవుతుండగా సమన్లు సైతం జారీ చేశారు. అయినా కోర్టుకు రాకుండా వాయిదాలు అడుగుతున్నారు. విచారణ చివరి దశలో ఉన్న కేసులు ఎస్సై కారణంగా వాయిదా పడుతున్నందున రాజారెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

పోలవరం రూరల్: పోలవరం మండలం పట్టిసీమ గ్రామానికి చెందిన నాగం అయ్యప్ప అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి పోలవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా అయ్యప్ప ఆత్మహత్యాయత్నానికి పాల్పడే సమయంలో ఒక వీడియో విడుదల చేశాడు. సీఎం చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పాలసీ ప్రకటించిన నేపథ్యంలో కొవ్వాడ కాలువలో ఉన్న ఇసుకను ట్రాక్టర్‌తో తీసుకు వెళుతుండగా అదే సమయంలో పోలీసులు దాడి చేసి ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దీంతో మనస్థాపానికి గురై అయ్యప్ప ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెబుతున్నారు.

బాస్కెట్‌బాల్ బాలికల జిల్లా జట్ల ఎంపిక



అండర్-14, 17 జిల్లా జట్లకు ఎంపికైన బాలికలు

ఏలూరు రూరల్: ఏలూరులో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 14, 17 జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. స్థానిక కస్తూరిబా బాలికల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అలివేలు పర్యవేక్షించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100 మంది బాలికలు పోటీలకు తరలివచ్చారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాస్, కోశాధికారి కె మురళీకృష్ణ, సెయింట్‌థెరిస్సా వ్యాయామ ఉపాధ్యాయురాలు మురళీ సెలక్షన్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

అండర్-17 బాలికల జట్టు : పి నందిని, జి ఏసమ్మ, డి అమృత, జి సరిత, టి పూజిత, పి లహరి, సీహెచ్ కీర్తి, కె రుచిక, కె కార్తీక, కె జస్విని, ఎంవీడీ భార్గవి, టి సుమతో పాటు స్టాండ్‌బైగా పి సత్యశ్రీ, ఎస్ సింగ్‌భవాని, ఏ రోహిన, పి జీతిక ఎంపికయ్యారు.

అండర్-14 జట్టు : పి మహేశ్వరి, ఎం యోగశ్రీ, డి డింపుల్, జి హోమజరమణి, పి శాంతిసులోచన, ఎం హేమశ్రీ, టి శ్రావణి, పి గీతాశరణ్య, ఎస్ శాత్విక, ఎం పూర్వశ్రీ, కె నాస్య, జి రత్నహారిక, స్టాండ్‌బైగా కె యజ్ఞస్వరూపిణి, జి జస్విత, జి రేణుకదేవి, ఎం దేదీప్య ఎంపికయ్యారు.

సీబీఐ అని బెదిరించి రూ.9 లక్షలకు టోకరా

ఏలూరు టౌన్: ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్ళు సీబీఐ అధికారులమంటూ బెదిరించి భారీగా సొమ్ములు కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు శ్రీరామ్ నగర్ 6వ రోడ్డుకు చెందిన మహ్మద్ రాహిల్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 23న ఉదయం ఇంట్లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నానని, మీరు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఈ ఫోన్ నెంబర్‌ను వినియోగిస్తున్నారంటూ బెదిరించాడు. ఇదే సందర్భంలో ఫోన్‌కాల్‌ను మరొకరికి కనెక్ట్ చేయగా వారు తాము ముంబై సీబీఐ పోలీసులమంటూ బెదిరించారు. వీడియోకాల్ చేసి ఆధార్ కార్డు, అతని పూర్తి వివరాలు చెప్పడంతో బాధితుడు కంగారుపడ్డాడు. నీపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, కేసు లేకుండా చేయాలంటే రూ.9 లక్షలు వేయాలని బెదిరించాడు. దీంతో బాధితుడు కాన్పూర్ మార్కెట్ ఏరియాలోని సీఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్‌కు రూ.9 లక్షలు నగదును బదిలీ చేశాడు. అనంతరం షాక్ నుంచి తేరుకుని తాను మోసపోయానని గుర్తించి ఏలూరు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించగా సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

చింతలపూడి: చింతలపూడి మండలం, రాఘవాపురం గ్రామానికి చెందిన చిమ్మపూడి నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో బుధవారం గ్యాస్ సిలెండర్ లీకయ్యి పేలడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, నిత్యావసరాలు, దుస్తులు మంటలకు కాలి బూడిదయ్యాయి. పేలుడు సమయంలో అదృష్టవశాత్తూ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. చింతలపూడి సీఐ రవీంద్ర నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల నుంచి వివరాలను సేకరించారు.

దారి కాసిన ప్రమాదం

- రోడ్డుపక్కనే వాహనాల పార్కింగ్
- ట్రావెల్స్ బస్సులదీ అదే తీరు
- నిత్యం ప్రమాదాలకు ఆస్కారం



తేతలి వైజంక్షన్ హైవేపై నిలిపిన వాహనాలు

తణుకు: నేషనల్ హైవేపై రోడ్డుపక్కనే నిలిపి ఉంచిన లారీని ఢీకొన్న సంఘటన.... ఆగి ఉన్న వాహనాన్ని తప్పించబోయి కాల్వలోకి దూసుకెళ్లిన మరో సంఘటన... లారీ ఢీకొని మోటారు సైకిలిస్టు దుర్మరణం... ఇలా తణుకు జాతీయ రహదారి నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో రక్తసిక్తమవుతోంది. తణుకు పట్టణాన్ని ఆనుకుని వెళుతున్న చెన్నై-కోలకత్తా జాతీయ రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాల కారణంగా ప్రతి ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రధానంగా రోడ్డు పక్కనే నిలిపి ఉంచిన వాహనాల కారణంగానే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని గతంలో అధికారులు సైతం నిర్ధారించారు. మరోవైపు ఇటీవలి కాలంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు సైతం నడిరోడ్డుపైనే బస్సులను ఆపి ప్రయాణీకులను ఎక్కించుకుంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ తంతు నడుస్తోంది. తణుకు పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డుతోపాటు సొసైటీ రోడ్డు, శర్మిష్ఠ జంక్షన్, తేతలి వైజంక్షన్ ఇలా రద్దీగా ఉండే ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. ముఖ్యంగా తేతలి వైజంక్షన్ వద్ద టీ దుకాణాల వద్ద నిర్లక్ష్యంగా వాహనాలు నిలుపుతుండటంతో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది.

అడుగడుగునా లోపాలు...

చెన్నై నుంచి కోలకత్తా వరకు నాలుగు లైన్లలో విస్తరించిన జాతీయ రహదారి తణుకు మండలం దువ్వ నుంచి సుమారు 12 కిలోమీటర్లు మేర విస్తరించి ఉంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రద్దీగా ఉంటోంది. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా పట్టణం, గ్రామాలు విస్తరిస్తుండటంతో రోడ్డు దాటేందుకు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా సెంటర్లలో నిర్వహణలోపం నిర్వహణ లోపం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారించడానికి ఏర్పాటు చేసిన సూచికలు, హెచ్చరిక బోర్డులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతోపాటు ఆయా సెంటర్లలో బస్సులు, ఇతరత్రా వాహనాలు నిలిపేందుకు బస్‌బే పేరుతో స్థలం వదలాల్సిండగా ఎక్కడా ఇలాంటి చర్యలు తీసుకోలేదు. దువ్వ సమీపంలోని వెంకయ్య వయ్యేరు, దువ్వ జంక్షన్, తేతలి గ్రామ జంక్షన్, తేతలి జంక్షన్, అయ్యప్పస్వామి దేవాలయం జంక్షన్, శర్మిష్ఠ జంక్షన్, ఉండ్రాజవరం జంక్షన్, పెరవలి వైజంక్షన్ తదితర ప్రాంతాలను ప్రమాదకర జంక్షన్లుగా గుర్తించారు. అయితే ఆయా జంక్షన్లలో రోడ్డు పక్కనే వాహనాలు ఉంచుతుండటంతో ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ట్రావెల్స్ దందా...

హైదరాబాదు, విశాఖపట్టణం, బెంగళూరు, ముంబాయి వంటి పట్టణాలకు నిత్యం తణుకు పట్టణం మీదుగా ట్రావెల్స్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం సుమారు 20 నుంచి 30 వరకు బస్సులు పట్టణంలోకి వచ్చి వెళుతుండగా మరో వందకు పైగా బస్సులు హైవే మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. తణుకు పట్టణంలోని పలువురు ట్రావెల్స్ యజమానులు బుక్కింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయితే ట్రాఫిక్ రద్దీగా ఉండే సమయాల్లో ముఖ్యంగా రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు ప్రధాన రోడ్లపై ట్రావెల్స్ బస్సులు నిలిపి ప్రయాణీకులను ఎక్కిస్తున్నారు. మరోవైపు హైవేపై సైతం ట్రావెల్స్ బస్సులు విచ్చలవిడిగా నిలుపుతుండటంతో ప్రమాదాలకు ఆస్కారం ఇస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో ఇలా బస్సులు నిలుపుతుండగా వేగంగా వచ్చే వాహనాలు గుర్తించలేకపోతున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని నియంత్రించాల్సిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

క్లుప్తంగా

గూడెంలో 70.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 70.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ బుధవారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 5.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

శ్రీవారి అన్నదాన ట్రస్టుకు రూ. 1,00,116 విరాళం


ద్వారకాతిరుమలలో విరాళం అందజేస్తున్న మురళీమోహన్‌రావు కుటుంబ సభ్యులు

తణుకు: ద్వారకాతిరుమల శ్రీవారి నిత్య అన్నదాన ట్రస్టుకు తణుకు మండలానికి చెందిన దాతలు రూ. 1,00,116 విరాళాన్ని మంగళవారం అందజేశారు. పైడిపర్రు గ్రామానికి చెందిన కొత్తపల్లి మురళి మోహనరావు కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని అనంతరం విరాళాన్ని చెక్కు రూపంలో కొత్తపల్లి సూర్య విఘ్నేష్ పేరుతో ఆలయ ఏఈవో మెట్లపల్లి దుర్గారావుకు అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ అధికారులు అభినందించారు.

పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం


పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ జన్మదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తమ జీవితంలో, కుటుంబంలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని తల్లిదండ్రుల సమానులైన వృద్ధుల మధ్య జరుపుకోవడం ద్వారా వారికి భరోసా కలుగుతుందన్నారు. అనంతరం వెంకటరమణను సత్కరించారు. అలాగే, వృద్ధుల కోసం సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాసా బాబూరావు, ఇసరపు అబ్బులు, ఐ.లక్ష్మి, కూచి వెంకట నాగేశ్వరరావు, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కృషి

తణుకు టౌన్: అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. బుధవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సునంద, మాజీ గ్రామ ఉప సర్పంచ్ రెడ్డి నరేంద్ర ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని గుండేపల్లి మధుప్రియ మెదడుకు సంబంధించి వ్యాధితో చికిత్స పొందుతోంది. శస్త్ర చికిత్స నిమిత్తం రూ.14లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో తమ కుమార్తెకు సాయమందించాలని ఆమె తల్లిదండ్రులు దాతలను అభ్యర్థించారు. దీంతో స్పందించిన ఆరుగొలను జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.58వేలు విరాళాన్ని సేకరించి విద్యాకమిటికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎస్.శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ కే.రవి, కమిటీ సభ్యులు ప్రభాకర్, గ్రామ పెద్దలు యుపీ.సత్యనారాయణ తదితరులు విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.

ఆరోగ్య సంరక్షణలో ఫార్మాసిస్టులది కీలకపాత్ర

తాడేపల్లిగూడెం: ఫార్మాసిస్టులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు ప్రాధాన్యత పెరిగిందని ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ఔషధాలను పంపిణీ చేయడమే కాకుండా, రోగి భద్రతను నిర్ధారించడం, విలువైన ఆరోగ్య సంరక్షణ సలహాలను అందించడంలో ప్రాముఖ్యత గురించి వివరించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్ , ఫార్మసీ కో ఆర్డినేటర్ లిఖిత, లిడియా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రాజేశ్వరరావు, డాక్టర్ ఆనంద దీపక్ కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలి


గుమ్మంపాడులో రైతులకు సూచనలు ఇస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి రాజేష్

అత్తిలి: వరిపైరుపై పురుగు, తెగుళ్లు ఉంటేనే మందులను పిచికారీ చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ రైతులకు సూచించారు. బుధవారం అత్తిలి మండలం గుమ్మంపాడు, ఉరదాళ్లపాలెం గ్రామాలలో పొలం పాలుస్తోంది కార్యక్రమం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఏఓ రాజేష్ మాట్లాడుతూ అవసరం మేరకే ఎరువులు, పురుగుమందులను వాడి, సాగుఖర్చులను తగ్గించుకోవాలని చెప్పారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు రైతుల సమస్యలను తెలుసుకుని నివృత్తి చేసారు. పశుసంవర్ధకశాఖలో అమలు అవుతున్న వివిధ పథకాలను రైతులకు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ నరిసింహారావు, ఫిషరీస్ అసిస్టెంట్ నరేంద్ర, వీఏఏలు హేమ, హారిక, జైరామ్ పాల్గొన్నారు.

లింగ వివక్ష చట్టరీత్యా నేరం

నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: ఆడ, మగ అనే లింగ వివక్ష చట్టరీత్యానేరమని అటువంటి వివక్షకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు తణుకు కోర్టులో బుధవారం న్యాయమూర్తులు లింగ వివక్షపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి డి.సత్యవతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డ ఆడ అయినా మగ అయినా ఒక్కటే అనే సమానత్వం రావాలని, సమాజంలో ఎవరైనా ఒకే విధంగా అనుకునే విధానం తల్లి తండ్రుల్లో కూడా రావాలని స్పష్టం చేశారు. ఉద్యోగాలు చేసుకునే మహిళలపై సెక్సువల్ వేధింపులు చోటుచేసుకోవడం బాధాకరమని, చిన్నపాటి వేధింపులు తలెత్తినప్పుడే మహిళలు ధైర్యంగా ఎదుర్కొనాలని సూచించారు. సమాజంలో మహిళల పట్ల గౌరవభావంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.సత్యకృష్ణలత, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు పి.సాయిరాం, కేవీఎస్ రంజిత్‌కుమార్, స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ చిరంజీవిరావు, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కె.దుర్గాభవాని, పి.శ్రావణి, ఎస్‌కే మొత్తి, పార లీగల్ వలంటీర్లు సాధనాల వెంకటగిరి, నాగమల్లేశ్వరి, మహిళా కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూడాలి

జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి



గూడెంలో వసతి గృహాల తనిఖీలో జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను సంక్షేమ అధికారులు సొంత బిడ్డల్లా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన పట్టణంలో సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు.ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, పీజీ చదువుతున్న విద్యార్థులు ఉంటున్న హాస్టల్స్‌ను సందర్శించి అక్కడున్న వసతులను గురించి తెలుసుకున్నారు. విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ఎవ్వరికైనా ఇబ్బందులు ఉంటే భయం లేకుండా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థులుంటుటన్న గదులు, వంట గదులు, మరుగుదొడ్లు, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలకు నిరుపేదల పిల్లలు చదువుకోడానికి వస్తారు. వారిని సొంత బిడ్డల్లా భావించి బాగా చదువుకొనేలా ప్రోత్సహించాలన్నారు. వసతి గృహాల నిర్వహణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలను వ్యయం చేస్తుందన్నారు. వసతి గృహాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన ఆహారం విద్యార్థులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీఓ బి.శివన్నారాయణ రెడ్డి, తహసిల్దార్ ఎం.సునీల్‌కుమార్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జీవిఆర్‌కె ఎస్‌ఎస్.గణపతి, సహాయ సంక్షేమ శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, వసతి గృహం అధికారి సీహెచ్.వినీల తదితరులు ఉన్నారు.

అన్నదాతల ఆదాయం పెంచడమే లక్ష్యం


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: సాగు పెట్టుబడులు తగ్గించి, పంట దిగుబడులు పెంచి రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని అప్పారావుపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మండలంలో 5293 మెట్రిక్ టన్నులు, పెంటపాడు మండలంలో 1423 మెట్రిక్ టన్నులు ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. రైతాంగాన్ని నష్టానికి గురి చేసే ఎలుకల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తుందని, రైతులంతా సామూహికంగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, డ్రోన్ల సాయంతో పురుగు మందులను తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారి చేయవచ్చన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. తద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. కాగా, నవాబుపాలెం - జగన్నాథపురం రహదారికి ఎమ్మెల్యే శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్‌లు పిల్లా రాంబాబు, ఉండ్రాజవరపు చంద్రిక, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలకు కడకట్ల విద్యార్థులు


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెంటపాడు: మండలంలోని కోడే వెంకటరావు మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు తబిత తెలిపారు. యోగా బాలికల విభాగంలో అండర్-17లో మహాలక్ష్మి శివాని ఎంపిక కాగా, బాలుర విభాగంలో పి. అఖిల్‌లు ఎంపికైనట్లు తెలిపారు. అదే విధంగా అండర్-14లో హారిక, బాడ్మింటన్‌లో సంతోష్‌లు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా యోగా టీచర్ జి.రూపను హెచ్‌ఎంతో పాటు, పలువులు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ నాగేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేస్తే దేశవ్యాప్త ఉద్యమం చేస్తాం


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జనగణన, కులగణన చేయకుండా ఎస్సీ వర్గీకరణ చేస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హెచ్చరించారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు సెంటర్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మంగరాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు సరికాదని, దేశవ్యాప్తంగా బంద్ చేశామని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను 341 అధికరణ ప్రకారం రాజ్యాంగ సవరణ జరగకుండా వర్గీకరణ చేయడమనే హక్కు ఎవరికి లేదన్నారు. పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ల శాతాన్ని 22కు పెంచాలన్నారు. రాబోయే రోజులలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తుంగలోకి తొక్కిందని, అంబేడ్కర్ ఫ్లెక్సీలను చించడం, దళితుల మీద దాడుల చేయడమే సరిపోతుందని, ఎమ్మెల్యే రఘురాం కృష్ణంరాజు, పతం నానాజీలపై కేసులు నమోదు చేయాలని, పార్టీల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో శరత్ బాబు, చోడదాసి జైపాల్, సునీల్ కుమార్, ఏసు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు మండపాక విద్యార్థులు


రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికైన మండపాక విద్యార్థులు

తణుకు టౌన్: ఏలూరులోని డీఎస్‌ఏ స్టేడియంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్విమ్మింగ్ (ఈత) పోటీలలో తణుకు రూరల్ మండలం మండపాక గ్రామానికి చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం ఆర్ మోహన్‌బాబు తెలిపారు. అండర్-14 విభాగంలో జీ తరుణ్, కే చరణ్‌లు, అండర్ 17 విభాగంలో ఎస్ గణేష్, ఏ శ్యామ్, బీ బార్గవ్, ఆర్ పల్లపరాజు, జీ అభిషేక్‌లు విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు బుధవారం తెలిపారు. ఈపోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు అక్టోబరులో పల్నాడులో జరిగే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలలో ఉమ్మడి జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్యనారాయణలను గ్రామ సర్పంచ్ జానా వెంకట లక్ష్మి, నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్ గూడూరి మహాలక్ష్మిలు అభినందించారు.

'గూడెం'లో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక


ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక దృశ్యాలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఈ తనిఖీ జరిగింది. ఈ సందర్భంగా డ్వామా పీడీ ప్రభాకర్ మాట్లాడుతూ రూ.7.70కోట్లు వేతనాలు, రూ.2.75కోట్లు మెటీరియల్ కాంపోనెంట్‌గా చెల్లించామన్నారు. వీటిలో ఉపాధి హామీ పథకంలో రూ.60.584లు, ఆర్‌డబ్ల్యుఎస్ నుంచి రూ.1,67,582లు రికవరీకి ఆదేశించినట్లు వివరించారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రంగరాజు, డీఆర్‌పీలు జి.చంద్రబాబు, బాల చెన్నయ్య, టీఏలు థామస్, సుమలత, అంబుడ్స్‌మెన్ జె.ఆదినారాయణ, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

నేడు అలంపురంలో ఉచిత వైద్యశిబిరం

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణసేవా ఆస్పత్రిలో ఈనెల 26న ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన కార్డియాలజీ, గైనకాలజీ, చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు, అంకాలజీ, జనరల్ మెడిసన్ వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. ఈ వైద్యపరీక్షలతో పాటు, ఈసీజీ, 2డి ఈకో, స్కానింగ్ పరీక్షలు, ఫిజియోథెరఫీ వైద్యపరీక్షలు అవసరమైనవారికి ఉచితంగా చేస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుపై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న నన్నేటి పుష్పరాజ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం దళితులపై చేస్తున్న దాడులు ఆపాలని మాల మహానాడు ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం కడకట్లలో బహుజన సేన రాష్ట్ర కోఆర్డినేటర్ గుంపుల సత్యకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ మాట్లాడుతూ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు డా.బాబా సాహెబ్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేయడంతో చాలా దుర్మార్గం అని అన్నారు. అలాగే కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజి కాకినాడలో వైద్య కళాశాలలోని దళిత అధికారిపై అసభ్యకరమైన బూతులు తిట్టడం హేయమైన చర్యని అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దళితులను వేధించడానికి ఉపయోగిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. నాయకులు ఊర్ల రాజశేఖర్, గడ్డం అచ్చిబాబు, చెల్లె రాజ్ కుమార్, తరపట్ల జోషి, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో దంచికొట్టిన వాన


తణుకులో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం

తణుకు: తణుకు పట్టణంలో వర్షం దంచికొట్టింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ప్రధాన రోడ్లు జలమయం అయ్యాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయం అయ్యాయి. ప్రధాన డ్రైనేజీలు సైతం పొంగి ప్రవహించాయి. రోడ్డు పక్కనే వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు సైతం అవస్థలు పడ్డారు. తణుకులో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 56.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

దివ్యాంగ పిల్లలను ఆదరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని లయన్స్‌క్లబ్ స్పిరిట్ అధ్యక్షుడు ఎంకేఎస్ సుందర్, వైద్యులు నార్ని బావాజీలు పేర్కొన్నారు. అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు సందర్భంగా స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో బుధవారం దివ్యాంగులకు వివిధ రకాల క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మెంబర్‌షిప్ చైర్‌పర్సన్ బత్తుల ప్రసాద్, డైరెక్టర్లు వీర వెంకయ్య, నార్ని ఫణి దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



బల్లిపాడులో వ్యాపారస్తులకు పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, నాయకులు

అత్తిలి: స్వచ్ఛత, పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాల్సిన అవసరముందని సర్పంచ్ కసిరెడ్డి బాలలక్ష్మీనారాయణ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో బుధవారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో వాణిజ్య, మార్కెట్ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ బాలాజీ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్తక దుకాణాలు వారు ప్లాస్టిక్ కవర్‌ల వాడకాన్ని నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ప్రగడ నాగేశ్వరరావు, స్థానిక నాయకులు గారపాటి బాబ్జి, తోట గణేష్, ఆచంట సుబ్బారావు, గారపాటి అశోక్, ఆకుల రామచంద్రరావు, కసిరెడ్డి అప్పారావు, ప్రగడ శ్రీనివాస్, విత్తంశెట్టి సత్తిబాబు, దాసం ఆదియ్య, సెక్రటరీ పి మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

తణుకు టౌన్: ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల కారణంగా నిరాశ్రయులైన సింగ్ నగర్ వాసులకు తణుకు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిఫ్ ఆధ్వర్యంలో దుప్పట్లు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. బుధవారం తణుకు పాస్టర్స్ ఫెలోషిఫ్ నాయకులు విజయవాడ సింగ్ నగర్‌లో బాబూరావు చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో వరద కారణంగా ఆప్రాంతంలో నిరాశ్రయులైన వారికి దుప్పట్లు, నూతన వస్త్రాలతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు ఎం హారత్ బాబు, అధ్యక్షుడు పీడీ ప్రసన్న కుమార్, కార్యదర్శి వై జయబాబు, ఏసురత్నం, కోశాధికారి కె సైమన్‌పాల్, ఆర్గనైజర్ కె పండన్న, షాలోమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.